# అర్ధనారి

స్నానానికని పరికరాలన్నీ పట్టుకుని మెట్లు దిగుతున్నాను. దిగువను, కుళాయిదగ్గిర, మా తాయారమ్మ ఎవరిమీదనో గొంతు చించుకుంటూంది.

తెల్లవారగానే ఎవరా అక్షింతలు వేయించుకునేందుకు అప్పుడే తయారైనారు అనుకుంటూ, యింకో రెండు మెట్లుదిగి, ప్రక్కనున్న కటకటాలలోనుంచి ఆవారకు పరకాయించాను.

గుమ్మంలో-ఆ మనిషి, నదురూ బెదురూ లేకుండా అంటూన్నది తన్ను కాదన్నట్టు నిలుచునిఉంది. తాయారమ్మ కుళాయి మొగదలనుంచి ముఖం కండలు చించుకుంటూ, మీదికి లంఘించబోతూంది.

—"ఎత్తింది ఆడజన్మకాదటే!-

"సిగ్గు ఉండక్కర్లా?—

"ఛీ................."

"పోవేం" అంటూ చేతిలోవున్న చెంబుకాస్తా ఆ మనిషి మీదికి గిరవాటు వేసింది.

అవతల మనిషి తొణకకుండా అది అందిపుచ్చుకుని మళ్ళిపోతూంది. దాని ఓఘాయితనం చూసి, అరచుకుంటూ "దొంగ - దొంగ -" అని పొలికేకలతో ఊరూ-నాడూ ఏకంచేస్తూ తాయారమ్మ వీధిలో పోయిపడ్డది.

వాళ్ళ నడుమను నలుగురూ పోగైనారు. తలొకడూ తలో మాదిరిగానూ నిలవేసి గద్దిస్తున్నారు ........ పట్టపవలే యింటో జొరబడి, దోచుకుపోతూంది.

"లేదు!- అ తల్లి, నామీదికి బిచ్చ్ంపారేసింది. పుచ్చుకుపోతున్నాను—" అంటూంది ఆ మనిషి.

తాయారమ్మ అందరిలోనూ, ముక్కు-మీద వేలేసుకుంది—

"పొమ్మని గిరవాటు వేస్తే...."

"—వేసింది బిచ్చమనుకుని పుచ్చుకున్నా అమ్మా."

మేమందరం పకాల్ మన్నాము.

"వేసే తల్లులందరూ .... యింతే. యిలాగే మొగాన విసిరేస్తారు బాబూ — నూటికో కోటికో ఓ తల్లి యిందవే అమ్మీ అంటూ జాలితలుస్తుంది కాని...."

— నా మనసు జివ్వుమన్నది.

ఒక్కరూ తన్ను వెనకేసుకురాకుండా, బెల్లంకొట్టిన రాళ్ళల్లే ఉండటం చూసి తాయారమ్మ నిప్పులేకుండానే తగులడిపోతూంది....

"ఏమిట్రా చూసేది — సిగ్గుమాలినకుంకల్లారా!— ఆడది గుడ్డ ఊడదీసుకు వస్తే ఏమిట్రా చూసేది" అని, చుట్టూ నుంచున్న కుర్రాళ్ళనందర్నీ కసరి దాని చేతుల్లోంచి ఆ చెంబు ఊడలాక్కుని, ఏడుపు మొగంతో యింట్లోకి పారిపోయింది.

అందరూ, ఎవరిగుమ్మాల్లోకి వాళ్ళు పోయినారు. ఆ మనిషొక్కతే మిగిలింది .... నేను కూడా అక్కడ ఇందాకటినుంచీ నిలుచున్నానన్న సంగతి అప్పుడు నాకు తెలిసొచ్చింది. దాని ఒంటిమీద నా రెండు గ్రుడ్లూ సిగ్గుమాలి పొరలాడుతున్నాయ్!....

"పో బాబూ, మొండిమొలేసుకొచ్చింది మొగాళ్ళకోసం కాదు. నీ మానాన నీవు పో!—"

కత్తివాటంగా అని, చీరముడత రవంత క్రిందికి లాక్కుంది. నేను మేకపోతల్లే గొంతు గొణుక్కుంటూ, మామూలుగా లాల్చీ జేబు వ్రేళ్ళాడే అంతమేరా తడుము కున్నాను.

"అబ్బో! దిగివచ్చాడు, ధర్మరాజు!"

దాని మాటల్లో ఎంత మంట ఉందని? ఎందుకూ యీ బసివికి నామీద యింత కోపం? - పుణ్యానికిపోతే పాపం ఎదురైనట్లు - పోనీ పాపం అని దానిస్థితికి జాలిపడి—

ఇన్ని ముక్కలూ పట్టుకు తిట్టేశాను. విని, విని, చివరకు అది ఛర్ర్ మంది....

"వయసూ, వళ్ళూ అమ్ముడు పోకుండా అడుక్కుతింటున్నామనేనా - మారాజా యీ ఆగ్రహం అంతా...." అంటూ మెత్తనికత్తి కోతగా - రెప్పవాల్చ కుండా అడిగింది....

నేను, గుక్క తిప్పుకోలేక ఒక్క అంగలో యింట్లోకి దూకి, మెట్లన్నీ ప్రాకి - దిండుతోబాటు గోడకి కూలబడ్డాను. నబ్బుపెట్టె అదిరిపడి....బావురుమంది. స్నానాని కని క్రిందకు వచ్చినవాడిని .... దాని విసురుకు మళ్ళా ఎప్పటిచోటికే వచ్చి పడ్డానా?—

చట్టకు సత్తువ తెచ్చుకుని....బాసెపట్టుమీద లేచి కూర్చుంటున్నాను ....గుమ్మం మీద అది నిలుచుని ఉంది.

"ఏం బాబూ....నేను జ్ఞాపకం రాలేదా?—" అంటూ అడుగు లోపలికి వేసింది....

నాకు — యింకా జ్ఞప్తికి రాలేదు.

"నేను — సీతాయినయ్యా! పదేళ్ళక్రితం — నేనూ - మా అమ్మా, మీ పాదాల కడ బ్రతికేవాళ్ళం...."

ఆఁ - అదా యిది! - పనిచేస్తూ చేస్తూనే ఒకనాడు ఉన్నట్టుండి చెప్పకుండా యిద్దరూ మాయమైనారు. వాకబు చేశాను. కాని, ఎటు పోయినారో ఎవళ్ళూ చెప్ప లేదు. సరే, వీళ్ళసంగతి ఎన్నాళ్ళు జ్ఞాపకం ఉంటుంది? అప్పుడే మరచిపోయినాను - ఇది ఇంత పెరిగి పెద్దదైందా? - దీని అమ్మ ఏమైనట్లు? - బాగుందా?

నా మనసులో సందేహాలు అన్నింటికీ అది జవాబులు చెప్తూంది—

—“ఆవాళ, మావపేల - సందుమలుపులో నా చెయ్యిపుచ్చుకున్నారా? — అదిరిపోయి బేవురుమన్నాను కదూ ? అప్పుడెప్పుడో చేసిన పాడు పనికి, యిప్పుడు సిగ్గెందుకులెండి —చేయి గుంజుకుని ఆపళాన పోయి మా అమ్మమీద పడి, చెప్పడానికి జిహ్వవచ్చిపోయి ఎలాగో మొత్తుకున్నాను. మా అమ్మ బెంబేలుపడిపోయి - నెత్తీ నోరూ కొట్టుకున్నది— ఆవాళనుంచే మీయింట్లో పని మానిపించింది. మళ్ళా జీతం అడిగేందుకైనా మీ యింటి చాయలకు రాలేదు మేము. మా అమ్మంటే - మంచి నీతైన మనిషి బాబూ.

కొన్నాళ్ళు రోజులు ఎల్లాగో వెళ్ళమారించుకున్నాం. మా అమ్మకు ఆనాటికీ ఆనాటికీ కొనఊపిరి పడుతూంది. నా రెక్కలే మా యిద్దరికీ కాచిపోయాలి. పడుచు పిల్లలంటే—పనీపాటా చేయడానికి రమ్మని ఎవళ్ళుపడితే వాళ్ళు పిలుస్తారు. కాని, రెక్కలకష్టంతో పోనిస్తారా - అడిగినదానికల్లా అచ్చుకుంటేనే ఆ నెలకు జీతం ముట్ట జెప్పేది.

అలా బ్రతుకుదామంటే నాకు తగనిరోత — మా అమ్మకు అంతకంటే చీదర.

అడుక్కుతిందామని ఊరిమీద పడ్డాం. కాని ఏం లాభం- ఎంత గొంతుచించు కున్నా పూటకు చేరెడు గింజలు జోలెలో రాలేవికావు - ఏ మొగాణ్ణి దేవురించినా కన్నుగొట్టి నిదానించేవాడే కాని, కనికరించి ఓ కానిడబ్బు మా మొగాన కొట్టేవాడు కాదు. ఏ అమ్మలక్కను బ్రతిమాలినా, ఏ తల్లి కా తల్లి “ఇల్లా ఎత్తుకు తినకపోతే, దుక్కలాగా ఉన్నావ్, ఎక్కడన్నా పనీ పాటా చేసుకోరాదుటే!” అని కసిరి కొట్టేది.

ఏమిటి - వయసులో ఆడది చేసే పనీ పాటా? - లోకం సంగతి నీకు ఎరుక లేనిదేమిటి బాబూ....

నన్ను అమ్ముకునన్నా నన్ను కన్నదాన్ని పోషించుకుందామనుకున్నా-నిబ్బరం తెచ్చుకుని బయలుదేరేదాన్ని. కాని, మొగాడికన్ను మా పాపిష్టిది బాబూ - కన్ను మీద వారిగేసరికల్లా కాళ్ళు గజగజలాడేవి. ఛీ అనుకుని మళ్ళిపోయేదాన్ని—

పట్టపగలే దొంగతనం మొదలెట్టా. పట్టుపడ్డా - కొట్లో కూచున్నా. ఒకసారి కాదు, యిప్పటికి ముమ్మారైంది...

ఇలా తిరుగుతూ ఉంటా - మళ్ళా జైలుకు వెళ్ళేదాకా....

ఆడకూతురికి — జాలి పుట్టించడం మా సుళువయ్యా! ఇలా ఒళ్ళుకనబడేట్టు

చాలీచాలంది ఓ చింకిచుట్టుకుని, బిక్క-మొగంవేసుకుని, సాటి ఆడకూతుర్ని "తల్లీ, మొలచుట్టూ బట్టలేక .... ఇలా మానానికి క్రుగ్గిపోతున్నా, మాయమ్మా" - అని అరిచానా అంటే, ఆ యిల్లాలు తన గుట్టంతా బట్టబయలైనట్టు కంపరం ఎత్తిపోయి తన మొగుడి కంట నేను పడకుండా ఏదో పాత కోకొకటి నా మొగాన కొట్టి తరి మేస్తుంది. అది మారుబేరానికి అమ్ముకుంటే - మా ముసల్ది, నేనూ వారం రోజులు కడుపునిండా ముప్పొద్దులా బువ్వతింటాం.

వచ్చిన వీధికి మళ్ళీ రాను. అడిగిన తల్లిని మళ్ళీ అడగను — ఎత్తుకు తినేందుకు ఎన్ని వాడలైనా ఉన్నాయి కదండీ!—ఏం, మా బ్రతుకు బాగుండలా?"

నా మెదడంతా కరిగి కళ్ళల్లో పేరుకుపోయింది.

"ఓసి నీ బ్రతుకు బండలుకానూ — గదిలో తేవిణీ వేశావుటే" అని అరుచు కుంటూ తాయారమ్మ అక్కడికి గంతువేసింది. పోకపోతే దాన్ని జుట్టుపట్టుకు క్రిందికి ఈడుస్తానన్నది. మళ్ళీ చూడబోతే గడ్డాలూ మీసాలూ వచ్చిన పెద్దమనిషిని నాకు బుద్ధి ఉండక్కర్లేదా....అంది. పట్టపగలే అందరూ చూస్తూండగానే భార్లాగా ఇలా చేస్తావా అంది. నలుగురినీ పోగుచేసి నాకు బుద్ధి చెప్పిస్తానంది .... తక్షణం గది ఖాళీ చేసేయమంది. నేను వింటూ ఇల్లరికపు అల్లుడికిమల్లే గ్రుక్కమింగి ఊరు కున్నాను.

"మళ్ళీ యీ జాడ నెప్పుడన్నా వస్తే చూసిపోతాలే బాబూ...." అంటూ అది చెక్కుచెదరకుండా మెట్లుదిగి పోతూంది .... కడసారి మెట్టు దగ్గిర ఆగి, "యీ యిల్లాలితో ఎలా వేగుతున్నావు మారాజా!" అని నవ్వుకుంటూ పోయింది.

ఏదో యింట్లో అద్దెకువున్న పరాయివాణ్ణి అయిపోయినాను కాని, నిజంగా కట్టుకున్న మొగుణ్నే అయితే, దానిచేత అంత మాటపడి తాయారమ్మ నన్ను బ్రతుక నిచ్చేదా. గది తలుపు గడియ ఎంత బందోబస్తుగా ఉన్నా — ఆ చేతికి — నోటికీ అడ్డం వచ్చేదా? పాయె - పో!

సీతాయ్ బ్రతుకు చివరకు ఇలా అయిందా? ఎలా తెల్లవారుతుందో — దేశంలో ఎంతమంది పడుచులు....ఇలాగే సీతాయ్‌లు అయిపోతున్నారో!

హుం—ఇలాటి చరిత్రాత్మకములైన చచ్చు ప్రశ్నలు లక్షాతొంభై. తెలుగు వాణ్ణి కనుక పరాఖత్‌గా నాకు నేను వేసుకోగలను. ఎందుచేతనా? వాటికి జవాబు చెప్పుకునే బాధ్యత నాకూ, నా జాతికీ వేదకాలంనుంచీ లేదు!